# 36. పిచ్చి లచ్చి

మిత్రుడు సూర్యాన్ని కాస్త దూరం సాగనంపి ఇంట్లోకి వచ్చాడు రవి.

"ఏమండీ! మీ స్నేహితులు వచ్చినప్పుడల్లా కాఫీ తెమ్మంటూ ఉంటారు కదా! కాఫీ పొడీ, చక్కెరా బైట కొంటాం సరే. పాలు దొరకటం లేదు. పాలు లేకుండా కాఫీ ఎట్లా? ఇవాళ మిగిలిన పాలు చాలా కొద్ది, రేపు నీళ్ళ మజ్జిగే గతి!" అన్నది భార్య సుశీల.

"ఏం చెయ్యమంటావు? స్నేహితులు వచ్చినప్పుడు కాఫీ ఇవ్వటం మర్యాద. ఏం చేసేట్టు?"

"ఒక పని చెయ్యండి. హార్లిక్స్ కొనుక్కురండి. శ్రమకు శ్రమా మిగులు, పాల ప్రస్తావన ఉండదు కనుక గొడవ లేదు. హార్లిక్స్ ఆరోగ్యం కూడాను" అన్నది సుశీల.

"హార్లిక్సూ దొరకటం లేదన్నారు. సప్లయ్ లేదట!'

"ఏ బర్మా బజారులోనో దొరక్కపోదు. ప్రయత్నించండి" అన్నది సుశీల.

"సరే!"

**2**

మర్నాడు సాయంత్రం చేతిలో కాగితపు పొట్లాంతో, ఉత్సాహంగా చిరునవ్వులు చిలకరిస్తూ సూర్యాన్ని వెంటపెట్టుకొని వచ్చాడు రవి.

విజయసూచకంగా కాగితపు పొట్లాన్ని భార్యకు అప్పగించి – "బర్మా బజారులో సాధించాను, ఆస్ట్రేలియాలో తయారైన హార్లిక్స్. మా ఇద్దరికీ వేడి వేడి హార్లిక్స్ కలుపు" అన్నాడు రవి.

సుశీల వంటింట్లోకి వెళ్ళి అయిదు నిముషాలయ్యేటప్పటికి మూత తెరిచిన హార్లిక్స్ సీసాతో సహా వచ్చింది.

"అన్నయ్యగారూ! మా ఆయన తెలివితేటలు చూడండి. ఫారిన్ సరుకు తెచ్చారు. లోపలంతా గడ్డ కట్టింది. చూడండి" అని సీసాను సూర్యానికి అందించింది.

సీసా అందుకోవటంలో ఏదో పొరపాటు జరిగి, అది కింద పడి ముక్కలైంది. లోపల ఉన్న హార్లిక్స్ గడ్డలు గడ్డలుగా పడింది. చిత్రం – ఆ గడ్డల మధ్యలో మెరుస్తున్న వస్తువుల్ని విడదీసి చూస్తే చాలా ఖరీదైన మూడు లేడీస్ రిస్ట్‌వాచీలు సన్నని బంగారు గొలుసులతో సహా బయటపడినయ్.

రవి మీసాలు మెలేస్తూ లేచాడు – "ఇప్పుడు చూడు! నా తెలివితేటలు, ఈ రిస్ట్‌వాచీలు ఒక్కోటి కనీసం వెయ్యి రూపాయి లుంటుంది. అంటే ఎంత లాభమో ఆలోచించు!"

సూర్యం కల్పించుకొని "ఇది నీ తెలివితేటల్ని రుజూచేసే విషయం కాదు. ఎవడో స్మగ్లర్ హార్లిక్స్ పౌడర్లో ఈ మూడు రిస్ట్ వాచీలూ పూడ్చిపెట్టి కస్టమ్స్ కళ్ళు కప్పి బయటపడెయ్యాలని చూశాడు. అయితే అది ఇతర హార్లిక్స్ సీసాలతో కలిసిపోవటంవల్ల ఆ స్మగ్లర్ దాన్ని విడదియ్యలేకపొయ్యాడు. నీలాటి మూర్ఖుణ్ణి చూసి బర్మా బజారు వర్తకుడు గడ్డ కట్టిన హార్లిక్స్ నీకు అంటగట్టాడు. ఫారిన్ సరుకు దొరికింది కదా అని తీసుకొచ్చావు. పిచ్చి లచ్చి మూర్ఖుల్ని వరించటం ఈ ప్రపంచానికి కొత్తేం కాదు!"

"ఏదైతేనేం – సంపాయించిన లాభం చూడు!"

"మరోసారి ఇలాటి హార్లిక్స్ కొంటే, అప్పుడు నష్టపోక తప్పదు. ప్రతిసారీ ఇలాటిది జరుగుతుందని ఆశించకు" అన్నాడు సూర్యం.

"అదృష్టం వరించేందుకు అర్హతల్తో పని ఉండదు. ప్రతిసారీ అది ఎదురౌతుందనుకోవటం మూర్ఖత్వం" అన్నది సుశీల.

"వీటిల్లో నువ్వో రిస్ట్‌వాచీ తీసుకో. మిగతా రెండూ అమ్మేద్దాం" అన్నాడు రవి.

"తథాస్తు!" అన్నాడు సూర్యం.

*– ఆంధ్రప్రభ వారపత్రిక 21.2.1990*